క్లుప్తంగా

బెల్ట్‌షాపులు ఎత్తివేయాలి

భీమిని: రాష్ట్రంలో బెల్ట్‌షాపులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకులు మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం పీవైఎల్(ప్రగతిశీల యువజన సంఘం) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్ట్‌షాపులను రద్దు చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, దానిని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు మహేష్, తరుణ్, అఖిల్, అంజి, రాకేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు విక్రయిస్తే చర్యలు

చెన్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తు ఫారములు జిరాక్స్ సెంటర్లు, ఇతర షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. అభయహస్తం దరఖాస్తు ఫారములు దరఖాస్తులు స్వీకరణ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ప్రైవేట్‌లో ఎక్కడా కొనుగోలు చేయొద్దని తెలిపారు.

ఆలయంలో కుంకుమపూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో ధనుర్మాస కార్యక్రమాల్లో భాగంగా మహిళలు శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ పూజలు జరిపించారు.

ఆరెపల్లిలో పశువైద్య శిబిరం

భీమారం: పశువులకు కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడల సంతతి పెరుగుతుందని పశువైద్యాధికారి రాకేష్‌శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆరెపల్లిలో గర్భకోశ చికిత్స, పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 45పశువులకు పరీక్షలు జరిపి యజమానులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, నాయకులు రమేశ్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భీమారం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రవేశపెట్టిన భారత్ వికాస్ సంకల్పయాత్ర శుక్రవారం భీమారం మండలకేంద్రానికి చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్‌కళ్యాణ్, అన్నయోజన, దీన్‌దయల్ పథకాలపై సంబంధిత అధికారులు వివరించారు. కేంద్రం ప్రచురించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఇందులో ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సౌజన్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పనిచేస్తుందని మహిళా సాధికారత హబ్ జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య అన్నారు. హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో శుక్రవారం హబ్ జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య, జెండర్ స్పెషలిస్ట్ విజయ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లింగ వివక్ష, బాలిక విద్య, బాల్య వివాహాల నిరోధక చట్టం, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100నంబర్లకు సమాచారం అందజేసేలా చూడాలని పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



మంచిర్యాలటౌన్: జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతనంగా ఏర్పడగా, సంఘం సభ్యులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి, దస్నాపూర్, రాజారాం గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ నర్సరీ పనులను శుక్రవారం ఏపీఓ సత్యప్రసాద్, క్లస్టర్ సీఎల్ఆర్‌సీ సురేష్ తదితరులు పరిశీలించారు.

వందరోజుల్లో ఆరు గ్యారంటీల అమలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం: వంద రోజుల్లో మేనిఫెస్టోలో ఉంచిన ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రజలతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడువక ముందే, కొందరు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు ప్రారంభించారని ఆరోపించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, అన్ని కుదుట పడగానే వంద రోజుల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తామన్నారు. ప్రజలు ఆరు రోజుల తర్వాత దరఖాస్తులు తీసుకోరని బాధపడొద్దని, ఆరు రోజులైనా అధికారుల వద్దకు నేరుగా వెళ్లి దరఖాస్తులు ఇవ్వొచ్చని సూచించారు. ప్రజాపాలన గ్రామసభ గురించి రెండు రోజుల ముందే గ్రామాలకు సమాచారం ఇవ్వాలని, ఏ ఏ రకాల గుర్తింపు పత్రాలు ఇవ్వాలో, దరఖాస్తులు నింపే విధానం తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ విషయంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, సర్పంచ్ జక్కు భూమేష్, తహసీల్దార్ వేణుగోపాల్, ఉప సర్పంచ్ శ్రీనివాస గౌడ్, జన్నారం ఎంపీటీసీ రియాజొద్దీన్, మాజీ ఎంపీపీ శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇసాక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, సుధాకర్‌నాయక్, రాజన్న, మాణిక్యం, ఫసీఉల్లా, కరుణాకర్, రమేశ్, ఇంద య్య, రాకేశ్, హేమంత్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ప్రెస్‌క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరణ

జన్నారం: స్థానిక ప్రెస్‌క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జు ఆవిష్కరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనకు సన్మానం చేశారు. జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రెస్‌క్లబ్ భవనానికి నిధులు మంజూరు చేసి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి లింగన్న, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు కాంతయ్య, సతీశ్‌గౌడ్, వెంకట్, సత్యం, మల్లేశం, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, శంకరయ్య, రాజశేఖర్, ఇసాక్, సుధాకర్‌నాయక్, రాజన్న, తదితరులున్నారు.

రాములోరి అక్షింతలకు ఘన స్వాగతం



చెన్నూర్: మంగళ హారతుల మధ్య శోభాయాత్ర



భీమారంలో శోభాయాత్ర

- అయ్యప్ప స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర
- జనవరి 1 నుంచి ఇంటింటికీ పంపిణీ

చెన్నూర్: అయోధ్య అక్షింతలకు హిందూ బంధువులు ఘన స్వాగతం పలికారు. అక్షింతలకు స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మహిళలు మంగళ హారతులు, కోలటాల మధ్య శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. శోభాయాత్ర కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, గాంధీ చౌక్ మీదుగా జగన్నాథాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా మండల సమయోజక్ నడిపల్లి లక్ష్మణ్‌రావు, మండల సహ సమయోజక్ మంచాల రాజబాపు మాట్లాడారు. అయోధ్యలో జనవరి 22న శ్రీరామ ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని శ్రీ రామ అక్షింతలు ప్రతి హిందువు బంధుకు చేరాలని అయోధ్య ఆలయ ట్రస్ట్ అక్షింతలు పంపించారని తెలిపారు. జనవరి 1నుంచి 15వరకు చెన్నూర్ పట్టణంతో పాటు మండలంలోని ప్రతి గ్రామంలో గల హిందు బంధువులకు అక్షింతలు పంపిస్తామన్నారు. ఇందు కోసం కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు రత్న లక్ష్మీనారాయణరెడ్డి, లట్టి రాజబాపు, బెల్లంకొండ మల్లారెడ్డి, భజన మండలి సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర

భీమారం: రాములోరి అక్షింతల శోభాయాత్ర భీమారం మండల కేంద్రంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చెన్నూర్ నుంచి వచ్చిన తలంబ్రాలకు బస్టాండ్ ప్రాంతంలో మహిళలు స్వాగతం పలికారు. అనంతరం శోభాయాత్రగా స్థానిక రామాలయం వరకు తీసుకెళ్లి అందులో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొగ్గుబాయి వార్తలు

ఏఐటీయూసీ గెలుపుతో టీబీజీకేఎస్ సంబురాలు

మందమర్రిరూరల్: మూడు రోజుల క్రితం జరిగిన ఎన్నికల ఫలితాల్లో మందమర్రి ఏరియా ప్రాతినిధ్య సంఘంగా ఏఐటీయూసీ ఐఎన్టీయూసీపై 469ఓట్ల మెజారిటీతో గెలిచింది. ఐఎన్టీయూసీకి 1648ఓట్లు రాగా ఏఐటీయూసీకి 2117ఓట్లు వచ్చాయి. ఈ గెలుపుపై టీబీజీకేఎస్ నాయకుల్లో సంబురం అంబరాన్నంటింది. సింగరేణిలో పదేళ్లు గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ ముందు నుంచి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఒంటరిగా బరిలో ఉంటామని చెప్పింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేజిక్కడంతో ఒక్కసారిగా టీబీజీకేఎస్ డీలా పడిపోయింది. అగ్ర నాయకులు యూనియన్‌కు రాజీనామా చేశారు. ఒకింత పోటీ నుంచి తప్పుకోవాలని భావించినా, అధిష్టానం మరోసారి ఆలోచించి తప్పకుండా బరిలో నిలవాలని నిర్ణయించుకుంది. కానీ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు రాకపోయేసరికి ఏరియాలో కొంతమంది టీబీజీకేఎస్ నాయకులు సర్దుకుని ఐఎన్టీయూసీలోకి వెళ్లారు. దీంతో పరిస్థితి పూర్తిగా చేజారిపోతుందనే అంచనాకు వచ్చిన మరికొంత మంది టీబీజీకేఎస్ నాయకులు అంతర్గతంగా ఏఐటీయూసీకి మద్దతు తెలిపారు. ఏరియాలో టీబీజీకేఎస్‌కు 81ఓట్లు మాత్రమే వచ్చినా, తమ మద్దతు ద్వారానే ఏఐటీయూసీ 469ఓట్ల మెజారిటీతో గెలిచిందని సంబురాలు చేసుకున్నట్లు కార్మికులు అనుకుంటున్నారు. ఏదిఏమైనా గత ప్రభుత్వం మాదిరిగా ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా కార్మిక హక్కులపై, ఎన్నికల ముందు యూనియన్ నాయకులు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని కార్మిక వర్గం కోరుకుంటుంది.



ఎన్నికల ఫలితాల రోజు సంబురాల్లో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు

‘ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం’

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య పేర్కొన్నారు. ఏరియాలోని ఐఎన్టీయూసీ ఆఫీస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ఐఎన్టీయూసీని ఆదరించి, ఆరు ఏరియాల్లో గెలిపించినందుకు కార్మిక లోకానికి ధన్యవాదాలు తెలిపారు. ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాంశెట్టి నరేందర్, సదయ్య, సీవీ రమణ, సూర్యనారాయణ, ఇప్ప సమ్మయ్య, వెంకటస్వామి, లక్ష్మణ్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు సమ్మయ్య

తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ బెంగుళూరు సహకారంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ వారి బ్లడ్‌బ్యాంకులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల బోన్ మ్యారో వైద్య పరీక్షలు నిర్వహించారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించేందుకు గాను వ్యాధిగ్రస్తులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా హ్యూమన్ ల్యూకోసైట్ ఆంటిజెంట్స్(హెచ్ఎల్ఏ) టెస్టును చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి, సంకల్ప ఫౌండేషన్ సీఈవో రాకేశ్, ప్రాజెక్టు మేనేజర్ అభిజిత్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, ఎడ్ల కిషన్, కాసర్ల రంజిత్‌కుమార్, బ్లడ్‌బ్యాంక్ సూపర్‌వైజర్ కందుల మాధవి, పీఆర్వో రాజేశ్, స్టాఫ్ నర్సు సంధ్య, మల్లీశ్వరి, మణికంఠ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

‘ఫ్లెక్సీ ఏర్పాటు చేయకపోవడం సరికాదు’

జన్నారం: ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేకు సంబంధించిన ఫ్లెక్సీలు అధికారులు ఏర్పాటు చేయకపోవడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇసాక్ ఆరోపించారు. ఈ విషయంపై పొనకల్ గ్రామ పంచాయతీలో కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామానికో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, కార్యక్రమం గురించి గ్రామాల్లో ముందుగా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కరుణాకర్, మేకల మాణిక్యం, మహేశ్, ఫసీఉల్లా, ఇందయ్య, రమేశ్, రజాక్, ఇబ్రహీం, తిరుపతి తదితరులున్నారు.

‘ప్రజాపాలన’తో ప్రజలకు మేలు

- రెండో రోజు కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లిరూరల్/వేమనపల్లి/కాసిపేట/దండేపల్లి/భీమారం/చెన్నూర్‌రూరల్/తాండూర్/మందమర్రిరూరల్/జైపూర్/నస్పూర్/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం పేదలకు మేలు చేసేందుకే ప్రజాపాలన కార్యక్రమం ప్రవేశపెట్టిందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం రెండో రోజు కూడా దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీలు, మండలాల్లోని గ్రామ పంచాయతీలు, వార్డుల్లో కార్యక్రమం కొనసాగింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆరు గ్యారంటీ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కళాజాతను 15, 16వార్డులలో నిర్వహించి ప్రజలకు ఆటపాటల ద్వారా వివరించారు. నస్పూర్‌లో ‘12వ వార్డు కేంద్రం వద్ద వసతులు కరువు’ అని ‘సాక్షి’లో ఈ నెల 28న ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఫ్లడ్‌కాలనీలోని మార్టిన్ గ్రామర్ స్కూల్‌కి మార్చారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, భీమారంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, సర్పంచులు గద్దె రాంరెడ్డి, దాడి తిరుపతి, ఎంపీడీవో శ్రీనివాస్, వేమనపల్లిలో వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, డీటీ గోవింద్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, సర్పంచ్ కొండల్‌రెడ్డి, చెన్నూర్‌లో ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్‌లో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సర్పంచ్‌లు పూదరి నవీన్, దాగం శంకరమ్మ, మందమర్రిలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో భీరయ్య, కాసిపేటలో ఎంపీడీవో అలీం, తహసీల్దార్ భోజన్న, వ్యవసాయాధికారిణి వందన, ఎంపీవో నాగరాజు, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, బెల్లంపల్లిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్‌లు అశోక్, కృష్ణమూర్తి, వెంకటేశం, రాయమల్లు, ఎంపీటీసీలు సుభాష్ రావు, శకుంతల, జైపూర్ మండల ప్రత్యేక అధికారి పశుసంవర్ధ జేడీ రమేశ్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ, నస్పూర్‌లో మున్సిపల్ కమిషనర్ రమేశ్, బెల్లంపల్లిలో ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు, హాజీపూర్‌లో ఎంపీపీ స్వర్ణలత, ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్లు మంగ, ప్రభు, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, ఏఓ రజిత, పంచాయతీ కార్యదర్శులు సాయిరాం, స్వరూప, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



అశోక్‌రోడ్డులో దరఖాస్తులు స్వీకరిస్తూ..

‘అధికారుల నిర్లక్ష్యం’

కోటపల్లి: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. ప్రజాపాలనకు అధికారులే అన్నీ తానై వ్యవహరించాల్సి ఉండగా సమయపాలన లేక లబ్ధిదారులు నిరాశచెందుతున్నారు. మండలంలోని పంగిడిసోమారం, జనగామ గ్రామపంచాయతీల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించగా కార్యక్రమానికి మండల అధికారుల బృందాలు తొమ్మిది గంటల తర్వాత హాజరయ్యారు. ఉదయాన్నే ఎనిమిది గంటల వరకు గ్రామ పంచాయతీలకు చేరుకున్న పంచాయతీ కార్యదర్శులు అన్ని తానై వ్యవహరించి అధికారుల టీంలు వచ్చేవరకు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కొన్నిచోట్ల లబ్ధిదారులు అధికారులు వచ్చే వరకు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

మారుమోగిన శరణుఘోష



పూజలు చేస్తున్న వేదపండితులు నరహరి శర్మ

వేమనపల్లి: అయ్యప్ప శరణుఘోషతో మండల కేంద్రం మారుమోగింది. మండల కేంద్రానికి చెందిన దారం నగేష్-లావణ్య దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిగింది. వేదపండితులు నరహరిశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, అయ్యప్పస్వామి అభిషేకం వేదమంత్రోచ్ఛరణల మధ్య కొనసాగింది.

ఈపీఎఫ్ డబ్బులు జమ చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులు వారి పీఎఫ్ ఖాతాలలో జమ చేయాలని తెలంగాణ నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మద్దెర్ల సతీష్, కోశాధికారి మాద్గుల రాజం, నాయకులు జాబ్రీ హబీబ్, గాడిసెల శంకర్, జ్యోతి, రజిత, రాజేశ్వరి, మల్లయ్య, రమేశ్, గణేష్, శేఖర్, సాగర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘చపరాడ’కు పాదయాత్రగా భక్తులు



పాదయాత్రలో భాగంగా ఐబీ చౌరస్తాలో భక్తులు



కన్నెపల్లి నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: మహారాష్ట్రలోని దత్తావతార కార్తీక్ మహరాజ్ దేవాలయం చపరాడకు స్థానిక భక్తులు పాదయాత్ర చేపట్టారు. మంచిర్యాల లేబర్ కాలనీలో శుక్రవారం పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్రగా బయలుదేరిన భక్తులు రెబ్బనలో బసచేయనున్నారు. మరుసటి రోజు రెబ్బన నుంచి టోంకిని దేవాలయం వరకు 31న మహారాష్ట్రలోని చపరాడకు కార్తీక్ మహరాజ్ దేవాలయానికి చేరుకుంటారు. కార్యక్రమంలో భక్తులు రామన్న, కొండ చంద్రశేఖర్, పూదరి ప్రభాకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి మండలం నుంచి భక్తులు చపరాడ కార్తీక్ మహరాజ్ స్వామి ఆలయానికి శుక్రవారం మహాపాద్రయాత్ర చేపట్టారు. సుమారు 200మందికి పైగా భక్తులు పాదయాత్రగా వెళ్లి కార్తీక్ బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపడతారు.

ఆటో డ్రైవర్ల నిరసన



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు



దండేపల్లి: తాళ్లపేటలో కార్మికుల రాస్తారోకో

లక్సెట్టిపేట: ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని మండలంలోని ఆటో డ్రైవర్లు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశరు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో, తమకు గిరాకీ కావడం లేదని, దీంతో తమకు ఉపాధి కరువయ్యిందని ఆటో కార్మికులు వాపోయారు. ఇందుకు నిరసనగా దండేపల్లి మండల కేంద్రంతో పాటు తాళ్లపేటలో శుక్రవారం ఆటో కార్మికులు రాస్తారోకో చేశారు. ప్రభుత్వం తమకు ఏదైన భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీసీల డిమాండ్లు నెరవేర్చాలి

నస్పూర్: బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన నాయకులతో కలిసి సీసీసీ టౌన్‌షిప్‌లోని పోస్టాఫీసు వద్ద మోడీకి పోస్టుకార్డులు పంపించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోడంకి మహేశ్, నాయకులు రాసమల్లకుమార్, చంద్రగిరి, చంద్రమౌళి, వేముల కిరణ్ లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమిని: మండలంలోని కేస్లాపూర్‌లో ఇటీవల హత్యకు గురైన బొడ్డు జలేందర్ కుటుంబాన్ని శుక్రవారం మంచిర్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యుడు జిల్లపల్లి వెంకటేషం పరామర్శించారు. హత్య జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాలమహానాడు మండల కమిటీ ఎన్నిక

కోటపల్లి: మండల మాలమహానాడు నూతన కమిటీ ఎన్నికను శుక్రవారం జిల్లా అధ్యక్షుడు కంబాల రాజేశ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దండు శంకర్, ప్రధాన కార్యదర్శిగా పాలవుల్ల ప్రేంకుమార్ ఎన్నికయ్యారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ వేడుకలు

లక్సెట్టిపేట: భారత విద్యార్థి ఫెడరేషన్ 54వ ఆవిర్భావ వేడుకలను మండలంలోని నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో జెండా ఎగురవేసి సంబురాలు చేసుకున్నారు.

ట్రాఫిక్ కష్టాలు



మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన కొత్త రోడ్డు వేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు వాహనదారులు హమాలివాడకు వెళ్లేందుకు అశోక్‌రోడ్డు సమీపంలో గల అండర్‌బ్రిడ్జి నుంచి వెళ్లారు. దీంతో అండర్‌బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద ఎత్తున నిలిచి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి.